# చిలపల నూలుపై జి.ఎస్.టి.ని వ్యతిరేకిస్తూ

# చేనేత కార్మికుల ఆందోళన




వెంకటగిరి తాశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

**వెంకటగిరి, 27-6-17 :**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జి.ఎస్.టి. చట్టంలో చిలపలనూలుపై, ఇతర చేనేత ముడిసరుకుపై 5 శాతం పన్ను విధించింది. ఈ నేపధ్యంలో చిలపల నూలుపై జిఎస్‌టి రద్దుచేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం రాష్ట్రకమిటి ఇచ్చిన పిలుపుమేరకు 27-6-17న వెంకటగిరి పట్టణంలో చేనేత కార్మికులు ఆందోళన నిర్వహించారు.

ముందుగా పట్టణవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక తహశీల్‌దారు కార్యాలయం ఎదుట ధర్నా జరిపారు. ధర్నానుద్దేశించి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఈ ప్రాంత కమిటి అధ్యక్షులు చింతగింజల చినఓబయ్య మాట్లాడుతూ చేనేతరంగానికి రక్షణగా నిలబడాల్సిన పాలకులు చిలపల నూలుపై 5 శాతం జి.ఎస్.టి. విధించడం దారుణమన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు సంక్షోభంలో వున్న చేనేత పరిశ్రమపై జి.ఎస్.టి. భారం మోపడం చేనేతరంగానికి ద్రోహం తలపెట్టడమేనన్నారు. చేనేత పని గిట్టుబాటు కాక, వేరే వృత్తిలోకి వెళ్ళలేక, చేసిన అప్పులు తీర్చే దారి కనపడక, పెళ్ళాం పిల్లల్ని పోషించడమెలాగో అర్ధంకాక మానసికంగా చితికి అనేకమంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటివరకూ పన్ను పరిధిలోలేని చిలపల నూలుపైనా, రంగులూ ఇతర రసాయనాలపై కూడా 5 శాతం పన్ను విధించడం చేనేతను మరింతగా సంక్షోభంలోకి నెడుతుందని కావున జి.ఎస్.టి.ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నిలిపివేసిన శిల్క్ సబ్సిడీని ప్రతి చేనేతకార్మికుడికి కాలయాపనచేయకుండా తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు.

జి.ఎస్.టి. రద్దు డిమాండ్‌తోపాటు చేనేతలో వుపయోగించే ముడిసరుకులైన నూలు, జరీ, రంగు రసాయనాలు, సిల్కు, (పట్టు) తదితరాలను 30 శాతం రాయితీ ధరలకు అందజేయాలని, ఆధునిక మరమగ్గాల దిగుమతిని ఆపాలని, వాటి వుత్పత్తిని నియంత్రించాలని, చేనేతకు కేటాయించిన రిజర్వేషన్‌లను అమలు జరపాలని, జౌళిరంగం నుండి చేనేతను విడగొట్టి, స్వయం ప్రతిపత్తినిస్తూ చట్టబద్ధత కల్పించాలని, చేనేత వృత్తిని రక్షించాలని తదితర డిమాండులతో కూడిన వినతిపత్రాన్ని తాశీల్దారుకు అందజేశారు.

ఈ ధర్నాలో పాల్గొన్న చేనేత కార్మికులకు మద్దతుగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ వి.వి. రమణయ్య మాట్లాడుతూ చేనేత వృత్తి రక్షణకు కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఈ ఆందోళనా కార్యక్రమానికి కమిటి సభ్యులు వి.ఈశ్వరయ్య, నీలా సుబ్బరాయులు, నంధా వెంకటేశ్వర్లు, తదితరులు నాయకత్వం వహించారు. 200 మంది చేనేత కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. సంఘం కమిటి సభ్యులు ముందుగా చేనేత కార్మికులున్న వీధుల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు.

**రేపల్లె ఏరియా :**

చిలపలనూలుపై విధించిన జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ ఏఐఎఫ్‌టియు-న్యూ అనుబంధ ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో 14-6-17న రేపల్లె ఏరియా చెరుకుపల్లి మండల కేంద్రంలో తహసిల్‌దారుకు మెమోరాండం ఇచ్చారు.

19-6-17న రేపల్లె ప్రాంత చేనేత కార్మిక సంఘాల జెఏసి ఆధ్వర్యంలో రేపల్లె మండల కార్యాలయం వద్ద ఆందోళన జరిపి, తహసిల్‌దారుకు విజ్ఞాపన పత్రం అందజేశారు. 24-6-17న మరో పర్యాయం రేపల్లెలో చేనేత కార్మికులు జెఏసి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

ఈ కార్యక్రమాలలో ఇతర సంఘాల నేతలతో పాటు ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం నాయకులు కా॥ మంత్రివాడ వెంకట్రావు, దొంతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**మంగళగిరి :**

చేనేతరంగంలో చిలపలనూలుపై విధించిన జిఎస్‌టిని రద్దుచేయాలనే ప్రధాన డిమాండ్‌తో వివిధ చేనేత సంఘాల సంయుక్త చేనేత పరిరక్షణ కమిటి ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలో 27-6-17న ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మహిళలతో సహా నాలుగువందల మంది చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు సహకారసంఘాల ప్రతినిధులు, నూలుకొట్ల వ్యాపారులు వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. పాత మంగళగిరి నుండి తహశిల్‌దారు కార్యాలయం వరకు జరిగిన ప్రదర్శన అనంతరం స్థానిక మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాలో చేనేత పరిరక్షణ కమిటి అధ్యక్షులు, మంగళగిరి మాస్టర్ వీవర్స్ ప్రతినిధి జొన్నాదుల వరప్రసాద్, ఏఐఎఫ్‌టియు-న్యూ అనుబంధ ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ జగ్గారపు సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ కూరపాటి కోటేశ్వరరావు, ఇతర పలు చేనేత కార్మికసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం రాష్ట్ర కరపత్రం ముద్రించి చేనేత కార్మికుల నడుమ విస్తృత ప్రచారం నిర్వహించింది.

**వేటపాలెం :**

జిఎస్‌టి చట్టంలో చిలపలనూలుపై, చేనేత ముడిసరుకుపై 5 శాతం పన్ను విధించటాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన కరపత్రాన్ని ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం ఆధ్వర్యాన పంపిణీ చేశారు. వేటపాలెం, చీరాల మండలంలోని పందిళ్ళపల్లి నుండి ఈపూరుపాలెం వరకు అన్ని గ్రామాలలో, పేటలలో ప్రచారం చేస్తూ, చేనేత కార్మికులను చైతన్యం చేస్తూ గ్రూపు మీటింగులు పెట్టారు. జిఎస్‌టి వలన కలిగే నష్టాలు వివరించారు. ఈ ప్రచార కార్యక్రమానికి కామ్రేడ్స్ కోట సుబ్బారావు, యారాసు భాస్కరరావు, పింజల భూషణంబాబు, జిలానీ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

ooooo